## 89- ఐక్యమత్యపు ఆదేశం - విచ్ఛిన్నం నుండి నివారణ

﴿وَاعْتَصِمُوا بِحَبْلِ اللهِ جَمِيعًا وَلا تَفَرَّقُوا﴾ آل عمران:١٠٣

**అందరూ కలిసి అల్లాహ్ త్రాడును గట్టిగా పట్టుకోండి. విభేదాల్లో పడకండి. (3: ఆలె ఇమ్రాన్: 103).**

عن عرفجة قال: سمعت رسول الله ﷺ يقول: **((إنها ستكون هنات و هنات، فمن أراد أن يفرق أمر هذه الأمة وهي جميع فاضربوا بالسيف كائنا من كان))**

**"ఉపద్రవాలు, ఘోర ప్రమాదాలు సంభవించనున్నాయి. అలాంటప్పుడు ఐక్యంగా ఉన్న ముస్లిం సంఘాన్ని విచ్ఛిన్నం చేయడానికి పూనుకున్న వ్యక్తి ఎవడైనా సరే నరికెయ్యండి"** అని ప్రవక్త ﷺ చెప్పగా నేను విన్నాను అని అర్ ఫజ రజియల్లాహు అన్హు ఉల్లేఖించారు. (బుఖారి, ముస్లిం).

عن أبي هريرة رضي الله عنه قال: قال رسول الله ﷺ: **((إن الله يرضى لكم ثلاثا ويكره لكم ثلاثا، فيرضى لكم أن تعبدوه ولا تشركوا به شيئا، وأن تعتصموا بحبل الله جميعا، وأن تطيعوا من ولاّه الله أمركم، ويكره لكم قيل وقال وكثرة السؤال وإضاعة المال))**

ప్రవక్త ﷺ ఉపదేశించారని, అబూ హురైర రజియల్లాహు అన్హు ఉల్లేఖించారుః **"అల్లాహ్ మీ కొరకు మూడు విషయాలను ఇష్టపడ్డాడు. మరియు మూడు విషయాలను అసహ్యించుకున్నాడు. ఇష్టపడ్డవిః (1) అల్లాహ్‌ను మాత్రమే ఆరాధించి, అతనితో భాగస్వాముల్ని కల్పించకండి. (2) అందరూ కలిసి అల్లాహ్ త్రాడును గట్టిగా పట్టుకోండి. (3) అల్లాహ్ మీపై నిర్ణయించిన నాయకునికి విధేయులుకండి. ఇక అసహ్యించుకునేవిః (1) వ్యర్థమైన సంభాషణల్ని. (2) అధికంగా ప్రశ్నించడాన్ని. (3) ధనం వ్యర్థంగా వ్యయపరచడాన్ని"**. (బుఖారి, ముస్లిం).

عن العرباض بن سارية رضي الله عنه قال: وعظنا رسول الله ﷺ موعظة بليغة، وجلت منها القلوب وذرفت منها العيون، فقلنا: يا رسول الله! كأنها موعظة مودع فأوصنا، قال:

**((أوصيكم بتقوى الله والسمع والطاعة وإن تأمر عليكم عبد حبشي، وإنه من يعش منكم فسيرى اختلافا كثيرا فعليكم بسنتي وسنة الخلفاء الراشدين المهديين عضوا عليها بالنواجذ، وإياكم ومحدثات الأمور فإن كل بدعة ضلالة))**

ఇర్ బాజ్ బిన్ సారియ రజియల్లాహు అన్హు ఉల్లేఖనం ప్రకారం, ఒకసారి ప్రవక్త ﷺ బ్రహ్మాండమైన ఉపన్యాసమిచ్చారు. హృదయాలు కంపించి-పోయాయి. కంటి ఆశ్రువులు కారాయి. అయితే మేమన్నాముః ఓ ప్రవక్తా! ఇది మీ అంతిమ ప్రసంగముగా మాకు అనిపిస్తున్నది. మాకు వసియ్యత్ చేయండి అనగా ప్రవక్త ﷺ ఈ విధంగా వసియ్యత్ చేశారుః "**అల్లాహ్ కు భయభక్తులు కలిగి ఉండండి. మీ నాయకుడు ఇథోపియాకు చెందిన వ్యక్తి అయినప్పటికి మీరు అతని మాట వినండి. విధేయత పాటించండి. నా తరువాత మీలో బ్రతికియున్నవారు అనేక విబేధాలు చూస్తారు. అలాంటప్పుడు మీరు నా పద్ధతి, నా సాంప్రదాయాన్ని మరియు సన్మార్గంపై ఉన్న ఖులఫాయె రాషిదీన్ పద్ధతిని ఆవశ్యకమైనదిగా భావించండి. దాన్ని ఝౌడపళ్ళతో గట్టిగా పట్టుకోండి. జాగ్రత్తా! (ధర్మంలో) క్రొత్త క్రొత్త విషయాలు ప్రవేశపెట్టకండి. ప్రతి క్రొత్త విషయం దుర్మార్గం**". (అబూదావూద్, తిర్మిజి).

## విశేషాలుః

1- అల్లాహ్ గ్రంథాన్ని గట్టిగా పట్టుకోవాలని ఆదేశం.

2- విచ్ఛిన్నం కావడం, విభేదాల్లో పడటం కఠినంగా నివారించబడింది.

3- విభేదాలు ఏర్పడినప్పుడ ప్రవక్త ﷺ పద్ధతిని గట్టిగా పట్టుకోవాలని ఆదేశం.